క్లుప్తంగా

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయన తార ఆదివారం తెలిపారు. నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో 11 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న ఎం.వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడ్ని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా రామయోగయ్య స్వామి తిరునాళ్ల



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నిమ్మలబావి బజారులో శ్రీ అవధూత పొట్లపాడు రామయోగయ్య స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని స్వామివారి చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి స్వామివారి జెండాను ఊపి ఊరేగింపు ప్రారంభించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు స్వామికి నిండు బిందెలతో నీరు పోసి కొబ్బరికాయలు కొట్టి హారతులు సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సానాల పుల్లయ్య, బి. నరసింహారావు, గురవయ్య, దానయ్య, బత్తుల శ్రీనివాసరావు, అంకమ్మరావు, నాగలక్ష్మి, బుజ్జి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం నేటి తరానికి ఆదర్శం



వినుకొండ(నూజెండ్ల): స్థానిక వివేకానంద పాఠశాల 36వ వార్షికోత్సవాన్ని పట్టణంలోని గంగినేని గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాలరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడికను అలవరుచుకోవాలన్నారు. మనం ఉండే పరిసరాలను బట్టి భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. స్వామీ వివేకానందుడు, మహాత్మాగాంధీ వంటి గొప్పవారి జీవిత చరిత్రలు చదవడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా విధానం మారుతుందన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాషన్ షోలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సయ్యద్ రఫిక్, అహ్మద్, పాఠశాల నిర్వాహకుడు సయ్యద్ అరిఫ్, ఎంఈవో జఫ్రుల్లా, అనూష, కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

నాదెండ్ల: చందవరం గ్రామంలోని ముస్లిం ఖబరస్తాన్ సమీపంలో పేకాట శిబిరంపై నాదెండ్ల పోలీసులు దాడి చేశారు. పేకాటాడుతున్న అద్దంకి ప్రభాకర్, దర్నాసి కోటేశ్వరరావు, మొగిలి నాగార్జున, తోకల సుబ్బారావులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4050లు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులకు గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు గణపవరం నుండి నాదెండ్ల వెళ్లే రోడ్డులో ఐసీఎం కంపెనీ గేటు సమీపంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన మన్నెం చినరాఘవ, అచ్చి రమణలు జీవాలు మేపుకుంటూ జీవిస్తుంటారు. మధ్యాహ్నం సమయంలో ఇరువురూ ద్విచక్రవాహనంపై ఇంటికి వచ్చి భోజనం చేసి మరొకరికి భోజనం తీసుకెళ్తుండగా నాదెండ్ల నుంచి గణపవరం వైపు వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇరువురికీ గాయాలయ్యాయి. ఇరువురినీ స్థానికులు చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కార్యకర్తల అభీష్టం మేరకే తుది నిర్ణయం

వినుకొండ(నూజెండ్ల): కార్యకర్తల అభీష్టం మేరకే తన నిర్ణయం ప్రకటిస్తానని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అన్నారు. స్థానిక కొత్తపేటలోని మక్కెన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ మారుతున్నట్లు వస్తున్న వదంతులపై ఆయన స్పందించారు. వినుకొండ నియోజకవర్గం అభివృద్ధి కోసం పలు సూచనలు చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వినుకొండ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని అన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు పూర్తయితే రానున్న రోజుల్లో బొల్లాపల్లి మండలానికి తాగు, సాగునీటి వసతి ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గుంటకల ప్రసాద్, గంటా కాలేషా, గుడివాడ గుర్నాథం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మా కుమారీల బోధనలు మానవాళికి అనుసరణీయం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఏర్పడిన తర్వాత ఆధ్యాత్మిక కేంద్రాలు ఏర్పాటు కావటం సంతోషించతగ్గ విషయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మ కుమారీ సమాజానికి చెందిన నూతన భవనం భాగ్యవిధాత ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం కాసు కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శరీరం, రూపం తాత్కాలికమని, ఆత్మ గొప్పదంటూ బ్రహ్మకుమారీస్ సమాజం చెప్పే బోధనలు అనుసరణీయమన్నారు. గత పదేళ్ల నుంచి రాఖీ పండగ రోజున రాఖీలు కట్టేందుకు స్థానిక సమాజ సేవకురాలు అరుణ తమ గృహానికి వచ్చి రాఖీ కడుతుంటారన్నారు. నూతన భవనానికి కావాల్సిన సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మౌంటు అబుకు చెందిన బ్రహ్మకుమారీ షీలు, వరంగల్‌కు చెందిన సవిత, విజయవాడకు చెందిన శాంత, నరసరావుపేటకు చెందిన అరుణ, మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ కాంప్లెక్స్ నిర్మాణానికి కృషి

నరసరావుపేట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా అంజుమన్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రివర్గ సమావేశంలో అనుమతి తీసుకొని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం బరంపేటలో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మితమైన మసీదు, మదర్సాల ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రార్థన చేసి మాట్లాడారు. తాను ఈ మసీదు శంకుస్థాపనలో సైతం పాల్గొన్నానని, త్వరగా నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభించుకోవటం సంతోషకరమైన విషయమన్నారు. అంజుమన్ మసీదును వచ్చే రంజాన్ నాటికి ప్రారంభించి ముస్లిం సోదరులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌భాష, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని పాల్గొన్నారు.



మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, తదితరులు

పేదల వైద్యుడికి ఘన సత్కారం

నరసరావుపేట: రోగులకు ఆపద్బాంధవుడిగా మారి పదివేలకు పైగా బ్రెయిన్ సర్జరీలు చేసి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న ప్రముఖ బ్రెయిన్ సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి ఎందరికో మార్గదర్శి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పలు వర్సిటీల ద్వారా అవార్డులు పొంది కీర్తి ప్రతిష్టలు తెచ్చుకున్న డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి పట్టణంలోని శ్రీరాంపురంలో గల వీవీఆర్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఘన సన్మానం ఏర్పాటు చేశారు. దీనికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గుంటూరు లాంటి పట్టణంలో ప్రాక్టీసు మొదలు పెట్టిన శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం ఇతర జిల్లాల నుంచి వచ్చే రోగులకు ఆపరేషన్లు చేసే స్థాయికి ఎదిగారన్నారు. మెదడు పరంగా ఎవరూ చేయని ఆపరేషన్లు ధైర్యంగా నిర్వహించారన్నారు. డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనపై ప్రేమతో సన్మాన కార్యక్రమం నిర్వహించిన గ్రామానికి చెందిన స్నేహితులు, యువకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హనుమ శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు కారసాని శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, భవనం ఆంజనేయరెడ్డి, డి.అచ్చిరెడ్డి, పోతిరెడ్డి శివారెడ్డి, హనిమిరెడ్డి, మూరే రవీంద్రరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



హనుమ శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, వైద్యులు

ఆసుపత్రి గురించి అవాస్తవ కథనాలపై మండిపాటు



డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: పల్నాడుకే తలమానికంగా నిలిచి కోవిడ్ సమయంలో వేల మంది పేద రోగులకు ఉచిత వైద్యసేవలు అందజేసిన లింగంగుంట్ల కాలనీలోని 200 పడకల ప్రభుత్వాసుపత్రిపై చౌకబారు రాతలు మానుకోవాలని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓ దినపత్రికలో(సాక్షికాదు) హాస్పిటల్‌పై వచ్చిన కథనాన్ని ఆయన పూర్తిగా ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సుమారు 48మంది డాక్టర్లు, మరో 28మంది స్పెషాలిటీ వైద్యులు, 15మంది ఎమర్జెన్సీ వైద్యులు, 40మంది నర్సింగ్ స్టాఫ్, పారా మెడికల్ సిబ్బందితో హాస్పిటల్ సమర్థవంతంగా నిర్వహించబడుతుందన్నారు. రోజుకు 1000 మంది ఓపీ, 200 మంది ఇన్ పేషెంట్లతో ఇప్పటివరకు నాలుగు వేల మందికి ఆపరేషన్లు చేయటం జరిగిందన్నారు. ఇంత పెద్ద ఎత్తున సేవలు అందజేస్తున్న వైద్యశాలలో దూదిలేదు, దుప్పట్లు లేవంటూ వాస్తవ విరుద్ధమైన కథనాలు రాయటం సిగ్గుచేటన్నారు. మందులు కూడా అన్నీ అందుబాటులో ఉన్నాయని, తప్పుడు విమర్శలు చేసి పేద రోగుల్లో అయోమయం సృష్టించవద్దని పేర్కొన్నారు.

తుది దశకు కులగణన సర్వే

శావల్యాపురం : కుల గణన సర్వే పురోగతి తుది దశకు చేరినట్లు మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో కుల గణన సర్వే ముమ్మరంగా జరుగుతుందన్నారు. సర్వేను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు మండలంలో 80 శాతం నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో సర్వే పనులు వేగవంతంగా చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు సర్వే జరుగుతుందన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ , ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, వీఆర్వో ఆర్.రాధ, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఈ మోడల్ పేపర్ అచ్చు పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) వారు ముద్రించిన ఈ పుస్తకాలను నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దాత జాన్‌సైదా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకొని పరీక్షలలో మంచి ఫలితాలు తీసుకురావాలని కోరారు. హైస్కూల్ హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ కరీమూన్, పీఎం చైర్మన్ షేక్ మీరావలి, ఎంపీటీసీ సభ్యులు తోకల వీరరాఘవయ్య, పెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, షేక్ మాబుసుభాని, యూటీఎఫ్ నాయకులు కె శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోడల్ పేపర్ పుస్తకాలతో విద్యార్థులు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వాముల వారి ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ మనం నివసించే ఇల్లును మానవ శరీరంతో పోలిస్తే ఇంటి లోపల దీపాలను వెలిగించటం అనేది జ్ఞానాగ్నికి గుర్తు అని అన్నారు. ఇంటి బయట దీపాలు వెలిగించటం పరామత్మ శక్తికి గుర్తన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. జ్ఞానవేదిక చిలకలూరిపేట కమిటీ అధ్యక్షులు యద్దనపూడి వీరాంజినేయులు, సభ్యులు గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ, పోట్లూరి పుల్లయ్య, స్వర్ణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు



కీర్తనలు ఆలపిస్తున్న రవికులోత్తమరావు



త్యాగరాజ ఆరాధన ఉత్సవాలకు హాజరైన సంగీత ప్రియులు

సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడామైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగాయి. హైదరాబాదు ప్రసిద్ధ సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ రవికులోత్తమరావు, ఆర్ సుధాలక్ష్మి, మల్లెల దక్షిణామూర్తి, ఎస్.షణ్ముఖ, వి.వెంకటేష్‌ల బృందం సంగీత సాహిత్యాలను సమపాళ్ళలో మేళవించి, స్వరరాగ సుధా రస ధారలతో సకల జగత్తును రసానంద డోలికలలో ఓలలాడించారు. పంచరత్నాలతో పాటు పలు త్యాగయ్య కీర్తనలను ఆలపించి సంగీత ప్రియులకు శ్రవణానందం కలిగించారు. స్వామి వివేకానంద చైతన్య భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు కొల్లిపర కాశీవిశ్వనాథం నేతృత్వంలో సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లక్ష్మీ తిరుపతమ్మ జ్యోతి ఊరేగింపు



దాచేపల్లి : లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి జ్యోతి ఊరేగింపు కార్యక్రమం ఆదివారం చేపట్టారు. గురుస్వాములు హనుమంతరావు, మస్తాన్‌రావు, కొర్రపాటి ఏర్రయ్య, రామారావుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేసిన వాహనంపై అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. జ్యోతిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

మరొకరికి గాయాలు



చికిత్స పొందుతున్న కలివెల మణికంఠ



ఘటన స్థలంలో మృతి చెందిన మల్లేష్

మాచర్ల రూరల్: గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెంది, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని భైరవునిపాడు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నాగార్జున సాగర్ నుంచి ద్విచక్ర వాహనంపై మల్లేష్ (30), కలివెల మణికంఠలు మాచర్ల వస్తుండగా భైరవునిపాడు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మణికంఠ కాలికి తీవ్ర గాయాలు కాగా మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు. ఈ మేరకు విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఓర్వకల్లు తిరునాళ్ల లైసెన్సు హక్కుల వేలం

క్రోసూరు: అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవీ పేరంటాళ్లమ్మ వారి దేవస్థానం తిరునాళ్ల సందర్భంగా సోమవారం లైసెన్సు హక్కుల వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం దేవస్థానం ఈవో జి.రామకోటిరెడ్డి తెలిపారు. క్రోసూరులోని వీరభద్రమల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 11 గంటలకు వేలం పాటలు జరుగుతాయన్నారు. లైసెన్సు హక్కులు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి 25 వరకు అదేవిధంగా మార్చి 24 నుంచి 26 వరకు ఉంటాయన్నారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, చీరలు, జాకెట్ ముక్కలు సేకరించు హక్కు, లడ్డూప్రసాదములు, కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కులకు పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు చొప్పున ధరావత్తు చెల్లించాలన్నారు. పాటలలో హెచ్చు ధరకు పాడుకున్నవారికి మినహా ధరావత్తు సొమ్ము మిగతావారికి వాపసు చేయబడుతుందన్నారు.

నేటి నుంచి జగనన్న ఇళ్లపట్టాలకు రిజిస్ట్రేషన్లు

క్రోసూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇళ్లపట్టాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఈవోపీఆర్డీ పి.శివరామయ్య ఆదివారం తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయంలో సెక్రటరీ, వీఆర్వో ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందని వివరించారు. లబ్ధిదారులు తమ పరిధిలోని సచివాలయానికి హాజరుకావాలని తెలిపారు. ఫిబ్రవరి నెల 9వ తేదీతో ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లన్నీ జిల్లా కలెక్టర్ అథారిటీతో కన్వేయన్స్ డీడ్ కాపీలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేత శావల్యాపురం

శావల్యాపురం: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ క్రీడా పోటీల్లో శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల మహిళల క్రికెట్ జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు మండల క్రీడా కోఆర్డినేటర్ రాగుల రాధాకృష్ణమూర్తి ఆదివారం తెలిపారు. వినుకొండ పట్టణంలోని లయోలా హైస్కూలు నందు ఈ నెల 27న జరిగిన ఫైనల్ పోటీలలో ఈపూరు మండల జట్టుపై ఆడి శావల్యాపురం జట్టు విజయం సాధించినట్లు చెప్పారు.ఈ నెల 31న జిల్లా స్థాయిలో జరగనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో శావల్యాపురం జట్టు పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా విజేతలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, మండల కోఆప్షన్ హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర , వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టేటి రవి, జవంగుల బాబు, కొణతం ఏరుకలరెడ్డి, కొండారెడ్డి ఏసురాజు, దూదెకుల పెద మదార్, పొట్టిపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గురుబాబు, అబ్దుల్లా, రవి, నిర్మల, కుమ్మరి శ్రీనివాసరావులు అభినందించారు.



పోటీల్లో విజేతలుగా నిలిచిన యడ్లపాడు క్రీడాకారులు



విజయం సాధించిన జట్టుతో అధికారులు

ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో యడ్లపాడు జట్టు విజేత

యడ్లపాడు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో యడ్లపాడు మండల క్రీడాకారులు సత్తా చాటారు. బాల, బాలికల జట్లు వేర్వేరుగా ఐదు క్రీడా విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనపరిచి విజయం సాధించారు. ఐదు విభాగాల్లో మొదటి బహుమతులు, రెండు విభాగాల్లో ద్వితీయ బహుమతులు, మరో మూడు విభాగాల్లో తృతీయ బహుమతులు గెలుచుకుని నియోజకవర్గ స్థాయిలో యడ్లపాడు మండలాన్ని ముందుంచారు. ప్రథమస్థానాల్లో నిలిచిన విజేతలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో ఈపూరు క్రికెట్ జట్టు గెలుపు

ఈపూరు : ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ఈపూరు మండల క్రికెట్ టీమ్ విజయం సాధించి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు మండల సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. జట్టు జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి మండలానికి పేరు తీసుకురావాలన్నారు.

విద్యుత్ రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

నాదెండ్ల: ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి1 వరకు నాలుగు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ శాఖ డిస్కం వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు డీఈ చల్లా రమేష్ తెలిపారు. నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట రూరల్, గుంటూరు రూరల్ పరిధిలోని ప్రత్తిపాడు, డోగిపర్రు, ఫిరంగిపురం, వట్టిచెరుకూరు వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన డిస్కం వార్షిక ఆదాయ అవసరాలకు సంబంధించి రిటైల్ వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణను చేపట్టడం జరుగుతుందన్నారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో నేరుగా హాజరుకావటం గానీ, లేక విద్యుత్ శాఖ వెబ్‌సైట్‌నందు గానీ ప్రజాభిప్రాయం తెలియపరచాలని కోరారు.

చిలకలూరిపేట టౌన్: విద్యుత్‌శాఖ టారీఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాలని చిలకలూరిపేట విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గుంటూరులోని సంగడిగుంట, రాయపూడిలోని తమ శాఖ పర్యవేక్షణ కార్యాలయాల్లో బహిరంగంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు విధిగా హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు.

మహంకాళీ ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన దాసరి వెంకట నాగప్రసాద్, రాజేశ్వరమ్మ దంపతులు రూ.1,00,116 లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం విరాళ చెక్కును ఆలయ ఈవో టి. సుధాకర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల చైర్మన్ కొత్త సాంబశివరావు (వీఎస్‌పీ), కమిటీ సభ్యులు కాకుమాను వెంకట బదరీ నారయణ, ఆలపాటి ప్రసాదరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నిడమానూరి సురేంద్ర, సభ్యులు ఏలూరి అశోక్‌బాబు, కూరపాటి వెంకట అమర్, తుళ్లూరి మోహన్‌బాబు, నంద్యాల దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు.



విరాళం చెక్కును ఈవో సుధాకర్‌రెడ్డికి అందజేస్తున్న దాతలు

వేగవంతంగా డబుల్ రోడ్డు పనులు

క్రోసూరు: రూ.149 కోట్ల నాబార్డు నిధులతో జరుగుతున్న అమరావతి-బెల్లంకొండ డబుల్‌రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, సైడు డ్రైన్లు, మార్గమధ్యంలో కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్ నుంచి అమరావతి వైపు బీటీ రోడ్డు పనులు చకచకా జరుగుతున్నాయి. అదేవిధంగా క్రోసూరు నుంచి బెల్లంకొండ వైపు రోడ్డు పనులు జరుగుతున్నాయి. దొడ్లేరులో సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. అప్పటి నుంచి పనులు చకచకా సాగుతున్నాయి. ప్రజల చిరకాల కోరికైన ఈ రోడ్డు పూర్తయితే గ్రామాల్లో రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, ఇసుక రవాణా, ప్రజల ప్రయాణాలకు సులభతరమవుతుంది. వీటితో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



క్రోసూరు పరిధిలో జరుగుతున్న డబుల్ రోడ్డు బీటీ పనులు

మిర్చిని మింగేస్తున్న తామర పురుగు

కారెంపూడి: పల్నాడులో మిర్చి రైతులు సంక్రాంతి పండుగ తర్వాత నుంచి వచ్చిన వాతావరణ మార్పుల వల్ల మిర్చిలో తామర పురుగు సమస్యతో సతమతం అవుతున్నారు. వాస్తవంగా పండుగ తర్వాత గతంలో తామర పురుగు ఉధృతి తక్కువగా ఉండేది. తుఫాన్ ప్రభావం వల్ల కానీ, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా కానీ తామర పురుగు ఉధృతి ఎక్కువగా కన్పిస్తోంది. ఏ నోట విన్నా ఇదే సమస్య. చివరకు అది కంది పంటను సైతం ఆశించి పూత రాలుస్తూ నష్ట పరుస్తోంది. కారెంపూడి మండలంలో 2,081 ఎకరాలలో మిర్చి సాగవుతోంది. చాలా చోట్ల తొలి విడత కాయ కోతలు అయ్యాయి. తొలి కోతలోనే ఎకరాకు 5 క్వింటాళ్లపైనే దిగుబడి వచ్చింది. రైతులు సంతోషంతో ఉన్న సమయంలో పంటకు తామర పురుగు సోకడంతో వారి ఆశలు నీరుగారుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఎన్నో ఆశలతో పంటను సాగు చేస్తున్న రైతులు నిత్యం తామర పురుగు నివారణ గురించే ఆలోచిస్తూ దాని నివారణకు ఏవో ఒక మందులను పిచికారీ చేస్తున్నారు. చివరకు పంటపై లిక్కర్ కూడా స్ప్రే చేస్తున్నారు. వాస్తవంగా దీని నివారణకు మందులు లేవని కానీ కొన్ని మందులు వాడితే మాత్రం ఉధృతి తగ్గి ఫలితం ఉంటుందని గురజాల, నరసరావుపేట హార్టికల్చర్ అధికారులు చెబుతున్నారు. ఎకరాకు 20 నుంచి 30 జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని, ప్యూపా దశలో ఉన్న పురుగు ఆకు అడుగు భాగంలో కానీ చెట్టు మొదలులో కానీ గుడ్లు పెడుతుందని, దీనికి వేప పిండిని భూమిలో వేయడం లేదా వేప నూనె పైరుపై పిచికారీ చేయడం కానీ చేయాలని సూచిస్తున్నారు. గ్రాసియా, ఎలక్ట్రో, గ్రోఫ్రియా మందులు మార్చి మార్చి పిచికారీ ఫలితం ఉంటుందని హార్టికల్చర్ అధికారులు సూచిస్తున్నారు.



తామర పురుగు నుంచి రక్షణ పొందుతున్న మిర్చి పంట